
సాక్షి ప్రకాశం

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



తీగలేరుపై కొట్టుకుపోయిన చప్టా

ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద తీగలేరు ఉధృతి కొనసాగుతోంది. దీంతో వాగువద్ద చప్టా కోతకు గురైంది. - 8లో..



ఉసురుతీసిన అతివేగం

లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం ఓ ఆటో డ్రైవర్‌ను బలితీసుకుంది. సింగరాయకొండ మండలం కనుమళ్ల జంక్షన్‌లో ఈ ఘటన జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
31.3/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు

ఒంగోలు: జిల్లాలో 3, 4, 5 తరగతులు నిర్వహిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, విలీన ఉన్నత, విలీన హైస్కూలు ప్లస్‌లలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఈనెల 10, 11 తేదీల్లో బేస్‌లైన్ టెస్టు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి టీచింగ్ ఎట్‌ది రైట్ లెవల్ బేస్‌లైన్ పరీక్షలు తెలుగు, గణితం పరీక్షలను ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించాలన్నారు. బేస్‌లైన్ పరీక్ష నిర్వహణ, విధి విధానాలు, శాంపిల్ పరీక్ష పత్రాలను ఇప్పటికే మండల విద్యాశాఖ అధికారి మెయిల్, వాట్సప్ గ్రూపునకు పంపామన్నారు. ఉపవిద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సెక్టోరల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల హెడ్మాస్టర్లు ఈ పరీక్షను 3, 4, 5 తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలు అన్నింటిలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష నిర్వహణ అనంతరం ఫలితాలను వెబ్‌సైట్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

హాకీ జట్టు మేనేజర్‌గా పీఈటీ రవి



చీమకుర్తి: ఏపీ జూనియర్ హాకీ పురుషుల జట్టుకు సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు పీఈటీగా పనిచేస్తున్న తిరుమలశెట్టి రవి మేనేజర్‌గా ఎంపికైనట్లు రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 19 వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో నిర్వహించే 14వ హాకీ ఇండియా జూనియర్ పురుషుల జాతీయ టోర్నమెంట్‌కు మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా రవిని హాకీ అసోసియేషన్ ప్రకాశం జిల్లా నిర్వాహక కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కలెక్టర్ గ్రీవెన్స్ రద్దు

ఒంగోలు అర్బన్: ప్రతి సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే మీ కోసం గ్రీవెన్స్‌ను ఈ సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద బాధితులకు సహాయం అందించేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు వెళ్లారని, ఈ నేపథ్యంలో మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వివరించారు. ప్రజలు గమనించి జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతాల నుంచి సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు రావద్దని కోరారు.


విష సంస్కృతి నుంచి బాలలను రక్షించుకోవాలి



బాలోత్సవంలో నృత్యాలను ప్రదర్శిస్తున్న బాలికలు

ఒంగోలు టౌన్: యావత్ ప్రపంచాన్ని కబళిస్తున్న సాంస్కృతిక విష సంస్కృతి నుంచి బాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి మీదా ఉందని డా. చదలవాడ ఫణీంద్ర బాబు పిలుపునిచ్చారు. ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు 61వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఎన్టీఆర్ కళాక్షేత్రంలో భవిత కోసం బాలోత్సవం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రజా కళావేదిక కార్యదర్శి బెల్లంపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ బాలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి సమాజంలో బాలలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కళ్లకు కట్టినట్లు బాల కళాకారులు పలు కళారూపాలను ప్రదర్శించారు. జానపద కళల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అద్దంకికి చెందిన ప్రముఖ వైద్యులు డా.చదలవాడ ఫణీంద్రబాబు, ఎంతో మంది చిన్నారులకు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇచ్చిన చింతపల్లి సుబ్బలక్ష్మిని ఘనంగా సన్మానించారు. ప్రముఖ ఇంద్రజాలికులు బీవీ రామన్ నిర్వహించిన మ్యాజిక్ షో ప్రేక్షకులను ఆశ్చర్యచకితులను చేసింది. బొమ్మరిల్లు అనాథాశ్రమం నిర్వాహకులు పి.రాజ్యలక్ష్మి, టీఎల్ కాంతారావు, ప్రధానోపాధ్యాయులు ఎం వెంకట్రావు, కవి కూరపాటి పున్నారావు, పాల్గొన్నారు.

ఏకదంతాయ.. భిన్నరూపాయ



ఒంగోలు రాజాపానగల్ రోడ్డులో అశ్వవాహనంపై గణనాథుడు



సింగరాయకొండలో వజ్రాలను తలపించే వైట్ స్టోన్‌లతో మెరిసిపోతున్న గణపయ్య

ఓ చోట ధనుర్ధారియై.. మరో చోట అశ్వారూఢుడై.. ఇంకోచోట ప్రకృతి ఒడిలో... ఇలా భిన్న రూపాలలో కొలువైన విఘ్నాధిపతి భక్తులకు దర్శనమిచ్చారు. వినాయక చవితి వేడుకలను శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా స్వామివారి భారీ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో ఉంచి పూజించారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాల్లోను ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేశారు. మండపాలలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


– సాక్షి నెట్‌వర్క్



ఒంగోలు గ్రంథాలయం సెంటర్‌లో ధనుర్ధారియైన గణేషుని ప్రతిమ



మైనంపాడు రామాలయంలో హరిత వినాయకుడు




ఒంగోలు గాంధీనగర్ 5వ లైనులో రుద్రాక్షలతో అలంకరించిన పంచముఖ గణపతి



ఒంగోలు దక్షిణం బజారులో 33 అడుగుల మట్టి గణపయ్య



కంభం చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



ఒంగోలు రంగుతోటలో శివుని జఠాఝూటంలో ఉన్నట్లుగా బంగారు పుష్పాలతో అలంకరించిన గణేషుడు



ఒంగోలు అంకమ్మపాలెం కృష్ణమందిరం వద్ద కేదారినాథ్ ఆలయ సెట్టింగ్‌లో వినాయక మండపం



ఒంగోలు సమతానగర్‌లో కొబ్బరికాయలతో రూపొందించిన వినాయక ప్రతిమ

రైతు చూపు నర్సరీల వైపు

- నర్సరీల నుంచి మొక్కల కొనుగోలు
- ఒక్కో మొక్క రూ.1 నుంచి రూ.2 వరకు విక్రయం
- నర్సరీ మొక్కలతో సమయం, ఖర్చు ఆదా అవుతుందంటున్న రైతులు
- జిల్లాలో 215 అనుమతి పొందిన నర్సరీలు



షేడ్‌నెట్‌లో పెంచుతున్న మిరప నారు

బేస్తవారిపేట: ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు నర్సరీల నుంచి నారు, మొక్కలు కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. రైతులు ఒకప్పుడు ఆకుకూరలు, కూరగాయల పంటల సాగుకు నారు, విత్తనాలు సొంతంగా సమకూర్చుకునేవారు. నారు తయారు చేసే నర్సరీలు ఉండేవి కాదు. తమ పొలంలో కొంత భూమిని నారు కోసం కేటాయించి నారు పోసుకునేవారు. పంట దిగుబడిలో నాణ్యమైన ధాన్యాన్ని విత్తనాలుగా ఉపయోగించేవారు. తమ వద్ద విత్తనాలు, నారు లేకపోతే తోటి రైతుల వద్ద తీసుకుని పంటలు సాగు చేసేవారు. ఆధునిక కాలంలో రైతులు నూతన సాంకేతిక పద్ధతులను పాటిస్తున్నారు. నారు మడులకు స్వస్తి పలికారు. ప్రస్తుతం నారు గతంలో పడినంత కష్టం లేకుండా ప్రైవేట్ నర్సరీల నుంచి తెచ్చుకుంటున్నారు. దీని వల్ల సమయం, ఖర్చు కలిసి వస్తుందని, నారు ఒకే ఎత్తులో ఉంటుందని, నాణ్యతగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో 2023–24 మధ్య మిరప 95,129 ఎకరాల్లో, టమోటా 1746 ఎకరాల్లో సాగైంది. నేడు వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, బోర్లలో భూగర్భ జలాలు అడుగంటడంతో ఇప్పటి వరకు మిరప 2100, టమోట 850 ఎకరాల్లో నాటారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గే అవకాశముంది.

గతంలో మిరప, టమాట పంటల్లో నారు కోసం ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాల్సిన పరిస్థితి. రైతు పొలంలోనే వారికి కావాల్సిన నారు కోసం కొంత విస్తీర్ణంలో విత్తనాలు చల్లేవారు. అవి కొంతమేర పెరిగిన తర్వాత వాటిని పొలాల్లో నాటుకునేవారు. ఈ పనుల కోసం దాదాపు 30–45 రోజుల సమయం పట్టేది. మిరప, టమాట సాగు విస్తీర్ణం పెరగడం, తక్కువ సమయంలో దిగుబడులు రావాలని రైతులు ఆరాటపడుతున్నారు. ఐదేళ్లుగా మిరప పంటకు మంచి ధర పలకడంతో సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. టమాట, మిరప వంటి నారుమళ్లకు ప్రత్యామ్నాయంగా రెడిమేడ్‌గా మొక్కలు సరఫరా చేసే నర్సరీలు అందుబాటులోకి వచ్చాయి. నర్సరీల నుంచి మొక్కలు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు. కొందరు రైతులు తమకు నచ్చిన విత్తనాలను నర్సరీల్లో పెంచుకోవడానికి మొక్కకు కొంత ధర చెల్లిస్తున్నారు. మిరప, టమాట పంటలతో పాటు కూరగాయల సాగు అధికంగా చేస్తున్నారు. ఇందు కోసం రైతులు నర్సరీల్లోని షేడ్‌నెట్‌లో పెంచిన నారును, మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది రైతులు తమ విత్తనాలు ఇచ్చి నారు తయారు చేయించుకుంటున్నారు. జిల్లాలో 215 నర్సరీలు రైతులకు నారు సరఫరా చేస్తున్నాయి. రైతుకు అవసరమయ్యే మేర విత్తనాలను కొని నర్సరీ యజమానులకు ఇచ్చి నారు పెంచుకుంటారు. దీని కోసం మొక్కకు రూ.0.40 పైసలు నుంచి రూ.0.50 పైసలు చెల్లించాలి. 40 రోజుల తర్వాత మొక్కలు తీసుకెళ్లి పొలంలో నాటుకోవాలి. మరి కొందరు రైతులు మొక్కకు రూ.1 నుంచి రూ.2 చెల్లించి నర్సరీ యజమానుల వద్ద కొంటున్నారు.

లైసెన్స్ ఉన్న నర్సరీల నుంచి కొనుగోలు చేయాలి

రైతులు నారు కొనేటప్పుడు వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన నర్సరీల నుంచి మాత్రమే నారు మొక్కలు కొనుగోలు చేయాలి. రైతు నారు కోసం అందించే విత్తనాలు సర్టిఫైడ్ కంపెనీ నుంచి కొనుగోలు చేసి ఇవ్వాలి. షేడ్‌నెట్‌లోని నారు మొక్కలు శాస్త్రీయ పద్ధతుల్లో పెంచడం వల్ల నాణ్యతగా ఉండటంతోపాటు సమయం ఆదా అవుతుంది.

– గోపిచంద్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

వినాయకుడినీ దోచారు !

- చలానాల పేరుతో అడ్డగోలు దోపిడీ
- ప్రభుత్వ దోపిడీకి విస్తుపోతున్న భక్తులు

దర్శి: ప్రభుత్వం చలానాల పేరుతో వినాయకున్నీ వదల లేదు. సంవత్సరానికి ఒక సారి వినాయక చవితి పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రజలు జరుపుకుంటారు. సాధారణంగా వినాయక చవితికి మైక్ పర్మిషన్ కింద రూ.200 చలానా కట్టించుకుని అనుమతులు మంజూరు చేసేవారు. అయితే ప్రస్తుతం మాత్రం ఎన్ని రోజులు పెట్టుకుంటే అన్నిరోజులకు ఒకే సారి చలానా కట్టాలని చెబుతున్నారు. దీనికి తోడు విగ్రహం 3 నుంచి 6 అడుగులు ఉంటే రోజుకు రూ.350, ఆరు అడుగుల పైన ఉంటే రోజుకు రూ.700 లెక్కన చలానా ఎన్నిరోజులు పూజలు చేస్తే అన్ని రోజులు కట్టాలని నిబంధనలు పెట్టారు. మైక్ పర్మిషన్‌కు రోజుకు రూ.100 చలానా కట్టించుకున్నారు. దాదాపుగా ఎవరైనా 6 అడుగుల పైనే విగ్రహాలు పెట్టుకుంటారు. 9 రోజులు నవరాత్రులు వినాయకున్ని పూజిస్తారు. దీంతో రూ.6300 విగ్రహం పెట్టుకున్నందుకు, మైక్ పర్మిషన్‌కు మరో రూ.900 కట్టాలి. దీనికి తోడు పోలీసు మామూళ్లు సరేసరి. వినాయక పండపాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తామంటూ ఒక వాట్సాప్ నంబర్‌ను కేటాయించారు. అనుమతుల కోసం పోలీసుల వద్దకు వెళ్లిన మండప నిర్వాహకులతో ఆ నంబర్‌లో హాయ్ అని పెట్టిస్తున్నారు. వాట్సాప్‌లో ఒక ఫాం వస్తుంది. దాన్ని పూర్తి చేసి అప్‌లోడ్ చేయగా చలానా కట్టాలంటూ అడుగుతుంది. మీ సేవ ద్వారా చలానా కట్టించుకున్న తరువాత ఒక కాపీ పోలీసులు తీసుకుని ఒక కాపీ నిర్వాహకులకు ఇచ్చి పంపారు. 6వ తేదీ నాటికే దాదాపు వినాయక మండపాలకు చలానాలు కట్టడం పూర్తయ్యాయి. 8వ తేదీ హోం మంత్రి విలేకరుల సమావేశం పెట్టి రూపాయి కూడా చలానాలు తీసుకోవడం లేదని చెప్పడంపై భక్తులు మండిపడుతున్నారు. చలానాలు కట్టిన తరువాత ఇప్పుడు కట్టాల్సిన పనిలేదని చెప్పడం ఏమిటని.. చిత్తశుద్ధి ఉంటే ఆ చలానా నగదు తిరిగి ఇప్పించాలని కోరుతున్నారు. ఇలా గతంలో ఎప్పుడూ లేదని, ఇదేం దోపిడీ అని భక్తులు మండిపడుతున్నారు. విషయం తెలిసిన కొందరు తమ విగ్రహాల ఎత్తును తగ్గించుకున్నారు. పెద్ద పెద్ద విగ్రహాలు బుక్ చేసుకోవాలనుకున్నవారు కూడా అంత విగ్రహాలు వద్దని చిన్న విగ్రహాలు పెట్టుకున్నారు. దీంతో తయారీదారుల వద్ద పెద్ద విగ్రహాలు నిలిచిపోగా చిన్న చిన్న విగ్రహాలు మాత్రం పూర్తిగా సేల్ అయ్యాయి.



PERMISSION FOR EVENT BANDHOBUSTH APPLICATION RECEIPT(ORIGINAL)

Authorized Agent Name:	10890658-DA	Date of Payment:	06/09/2024
Application No:	PEB012406286164	Transaction Id:	TAPEB012400286164
Applicant Name:	ANNAPUREDDY	Service Required for:	Religious functions
Event From Date:	07/09/2024	Event To Date:	14/09/2024
No Of Days:	8	District:	Prakasam
Mandal:	MUNDLAMURU	Village:	VEMULA
Amount Paid (in Rs.):	5650		
Delivered in:	Within 5 working days from requested date .		

Asking Bribe? - Call ACB Toll-free number 14400 / ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడిన ACB టోల్-ఫ్రీ నెంబర్ 14400 కు ఫిర్యాదు చేయండి.

ముండ్లమూరు మండలం వేములలో 9 అడుగుల బొమ్మకు 8 రోజులకు కట్టించుకున్న చలానా

ఎయిడెడ్ ఉద్యోగులపై నిర్లక్ష్యం

- 6 నెలలుగా అందని జీతాలు
- జిల్లాలో 29 మంది ఉద్యోగుల పరిస్థితి ఇది

ఒంగోలు: ఎయిడెడ్ ఉద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నెలల తరబడి వారికి జీతాలు అందడంలేదు. ప్రతి రోజు విధులకు హాజరవుతున్నా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని స్థితి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరు నెలలకుపైగా జిల్లాలో 29 మంది ఎయిడెడ్ సిబ్బంది జీతం అందక ఇబ్బందులు పడుతున్నారు.

జీతాల విడుదలలో జాప్యం:

ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో ప్రక్షాళన జరిగింది. ఆస్తులతో సహా ఉపాధ్యాయులను ప్రభుత్వానికి అప్పగించడం (లేదా) ఆస్తులు లేకుండా ఉపాధ్యాయులను ప్రభుత్వానికి అప్పగించడానికి అవకాశం కల్పించారు. దీంతో చాలా ఎయిడెడ్ పాఠశాలలు కొన్ని దశాబ్దాలుగా ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ లేకపోవడం, విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడంతో వారు తమ ఆమోదాలను ప్రభుత్వానికి తెలియజేశారు. అయితే కొన్ని పాఠశాలలు మాత్రం న్యాయస్థానాలను ఆశ్రయించి పోస్టుల భర్తీకి అనుమతి పొందాయి. దీంతో విద్యాశాఖ వర్గాల ఆధ్వర్యంలో భర్తీ ప్రక్రియ ముగించారు. ఇలా ఈతముక్కల పాఠశాలలో 7, చేకూరపాడు పాఠశాలలో 7, ఒంగోలు గద్దలగుంట పాఠశాలలో ఏడుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, ఒకరు సెకండరీ గ్రేడ్ టీచరు, గిద్దలూరు మండలం కొత్తపల్లిలో ఒక పోస్టు, అద్దంకి ప్రకాశం ఎయిడెడ్ పాఠశాలలో రెండు, కనిగిరిలో రెండు స్కూల్ అసిస్టెంట్, మరో రెండు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను భర్తీ చేశారు. 2023 డిసెంబర్, ఆ తరువాత విధుల్లో చేరారు. వీరిలో 9 నెలలుగా జీతాలు అందుకోని వారు కొందరైతే, మరికొందరు ఆరు నెలలుగా జీతాలు అందుకోని వారు ఉన్నారు.

వేధిస్తున్న ఎంటీఎస్ సమస్య:

వీరంతా కోర్టు ఆదేశాలతో యాజమాన్యాలు పత్రిక ప్రకటన, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా రిక్రూట్‌మెంట్ పూర్తిచేశారు. ప్రొబేషన్ పీరియడ్‌లో మినిమం టైమ్ స్కేలు ఇవ్వాలని, ప్రొబేషన్ పూర్తయిన తరువాత రెగ్యులర్ స్కేల్ ఇవ్వాలంటూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రస్తుతం నెలలు గడుస్తున్నా కనీసం ఖజానా శాఖలో ఎంప్లాయి ఐడీకి నోచుకోలేదు.

జీతాలు వెంటనే విడుదల చేయాలి

నూతనంగా నియమించిన ఎయిడెడ్ టీచర్లకు జీతాలు విడుదలలో జాప్యం తగదు. తక్షణమే వారికి జీతాలు చెల్లించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఒక్క విద్యార్థి కూడా లేని ఎయిడెడ్ పాఠశాలల్లో 96 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారిని ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేసే అవకాశం ఉన్నా ఆ దిశగా ముందుకు సాగడంలేదు.

– సీహెచ్ ప్రభాకరరెడ్డి , ఏపీటీజీ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

చెరువులో జారిపడి వృద్ధురాలు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నాగమల్లీశ్వరరావు

టంగుటూరు: చెరువులో వృద్ధురాలు జారిపడి మృతిచెందిన సంఘటన టంగుటూరులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు గ్రామం అరుంధతీనగర్‌కు చెందిన షికా అచ్చమ్మ (80) ఉదయం గ్రామంలోని చెరువుకట్టపై గడ్డికోసుకుంటూ ప్రమాదవశాత్తూ జారి చెరువులో పడి మృతిచెందింది. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈతగాళ్ల ద్వారా చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

22న ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


వివరాలు వెల్లడిస్తున్న అప్సా ప్రతినిధులు

ఒంగోలు: గత పదేళ్లకుపైగా ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలు, వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ నిర్వహించనున్నట్లు ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) జిల్లా అధ్యక్షుడు గుడిపూడి హరిబాబు తెలిపారు. ఆ మేరకు అప్సా జిల్లా కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. అర్హుల పేర్లను తమకు 9177014253, 9948912128, 9948600494 సెల్ నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలని పాఠశాలల యాజమాన్యాలను కోరారు. సమావేశంలో అప్సా ప్రతినిధులు చైతన్య హరిబాబు, కె.ప్రభాకరరావు, సయ్యద్ కరిముల్లా, గాంధీ శ్రీనివాసరెడ్డి, ఓక్‌బ్రిడ్జి శివ, ఎ.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. సన్మాన వేదిక వివరాలను తర్వాత వెల్లడిస్తామన్నారు.

తీగలేరుపై కొట్టుకుపోయిన చప్టా


తీగలేరులో నీటి ఉధృతికి కోతకు గురైన చప్టాపై ట్రాక్టర్ నిలిచిపోయి అవస్థ పడుతున్న రైతులు

- ఇంకా కొనసాగుతున్న నీటి ఉధృతి
- గంటవానిపల్లెకు రాకపోకలకు అంతరాయం
- అవస్థపడుతున్న ప్రజలు

పెద్దదోర్నాల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత వారం కురిసిన భారీ వర్షాలకు గంటవానిపల్లె వద్ద తీగలేరు ఉధృతి ఇంకా కొనసాగుతోంది. తీగలేరుపై నిర్మించిన చప్టా పూర్తిగా కోతకు గురైంది. గంటవానిపల్లెకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కర్నూలు–గుంటూరు రహదారి నుంచి కిలో మీటరు దూరంలో ఉండే గంటవానిపల్లెకు ఈ చప్టాపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. అలాంటి రోడ్డుపై చప్టా కోతకు గురవడం, గంటవానిపల్లెకు మరో మార్గం లేకపోవడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. గ్రామంలోకి ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో చప్టా వద్ద నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న గ్రామానికి నడుచుకుంటూ రాకపోకలు సాగిస్తూ నరకం చూస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పంటల సాగుకు అవసరమైన సామగ్రి తరలించేందుకు ఆటంకం కలుగుతోందని రైతులు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలోనే బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు...

గంటవానిపల్లి గ్రామస్తుల చిరకాల స్వప్నమైన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కర్నూలు, గుంటూరు రహదారి నుంచి తీగలేరు మీదుగా గంటవానిపల్లి గ్రామానికి బ్రిడ్జి నిర్మించేందుకు రూ.270 కోట్లు మంజూరు చేస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం జీఓ నంబర్ 763 జారీ చేసింది. ఎన్నికల కారణంగా నిధులు విడుదల నిలిచిపోయింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమస్య నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తీగలేరుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి యుద్ధప్రాతిపదికన గంటవానిపల్లికి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

> **తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం**
>
> తీగలేరుపై కోతకు గురైన చప్టాకు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వరద నీరు నిరంతరం ప్రవహిస్తుండటంతో ప్రస్తుతం మరమ్మతులు చేసేందుకు అవకాశం లేదు. నీటి ఉధృతి తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. తీగలేరుపై బ్రిడ్జి నిర్మాణానికి గతంలో రూ.270 కోట్లు మంజూరయ్యాయి. దానికి సంబంధించి భూ పరీక్షలు కూడా జరుగుతున్నాయి.
>
> – రవీంద్రారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ

ఉసురు తీసిన అతివేగం

- మిరప లోడు ఆటోను ఢీకొన్న లారీ
- ఆటో డ్రైవర్ మృతి

సింగరాయకొండ: లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం ఓ టాటా ఏస్ మిరపలోడు ఆటో డ్రైవర్‌ను బలితీసుకుంది. ఆదివారం సాయంత్రం జాతీయ రహదారిపై సింగరాయకొండ మండలం కనుమళ్ల రోడ్డు జంక్షన్‌లో విమానాల రన్‌వేపై ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లా బీ కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన మేక భాస్కరరెడ్డి (40) నెల్లూరు జిల్లా వింజమూరు నుంచి విజయవాడకు టాటా ఏస్ ఆటోలో మిరపకాయల లోడుతో వెళ్తున్నాడు. సింగరాయకొండ మండల పరిధిలోని కనుమళ్ల జంక్షన్ సమీపంలోని విమానాల రన్‌వేపైకి రాగానే నెల్లూరు వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా నిర్లక్ష్యంగా లారీ నడిపి అకస్మాత్తుగా రెండోవైపునకు వచ్చి టాటా ఏస్ ఆటోను బలంగా ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆటో తిరగబడటంతో పాటు నెల్లూరు వైపునకు తిరిగింది. ఆటోలోని మిరపకాయల బస్తాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఆటో నుజ్జయిపోయి క్యాబిన్‌లో డ్రైవర్ భాస్కరరెడ్డి ఇరుక్కుపోయాడు. సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర సంఘటన స్థలానికి చేరుకుని మరో లారీ సహకారంతో ఆటో క్యాబిన్‌కు తాడుకట్టి బలంగాలాగి డ్రైవర్‌ను బయటకు తీశారు. అందుకోసం సుమారు గంటపాటు శ్రమించారు. అప్పటికే భాస్కరరెడ్డి తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. అతని రెండు కాళ్లు విరిగిపోయాయి. అక్కడ సిద్ధంగా ఉన్న 108 వాహనంలో హుటాహుటిన ఒంగోలు జీజీహెచ్‌కి అతన్ని తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భాస్కరరెడ్డి మృతిచెందాడని సీఐ హజరత్తయ్య తెలిపారు. అతనికి సుమారు 8 సంవత్సరాల క్రితం వివాహం కాగా, నలుగురు ఆడపిల్లలు ఉన్నారని బంధువులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు వెంబడించి జీవీఆర్ ఆక్వా కంపెనీ వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.


ఆటోలో నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు, ప్రజలు


ఆటో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ భాస్కరరెడ్డి


రోడ్డుపై పడిన మిరపకాయల బస్తాలను పక్కకు తరలిస్తున్న ప్రజలు


భాస్కరరెడ్డిని 108లో ఎక్కించేందుకు తీసుకెళ్తున్న యువకులు


పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న ప్రమాదానికి కారణమైన లారీ

కంభంలో రెండుచోట్ల రోడ్డు ప్రమాదాలు

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రమేష్

కంభం: కంభంలో రెండుచోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానిక అర్బన్ కాలనీలో నివాసం ఉంటున్న పిన్నంశెట్టి రమేష్, శ్రీధర్ శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అనంతపురం–అమరావతి హైవేపై ఫ్లెటైవర్ సమీపంలోని ఓ రెస్టారెంట్ వద్ద గేదె అడ్డు వచ్చింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో రమేష్ (31)కు తీవ్రగాయాలవగా, కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మార్కాపురం వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో ప్రమాదంలో.. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం మధ్యాహ్నం స్థానిక రావిపాడు రోడ్డు సమీపంలో హైవేపై జరిగిన ఈ ప్రమాదంలో సైకిల్ షాప్ నిర్వాహకుడు రఫీ తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల తీసుకెళ్లినట్లు సమాచారం.

ఎంపీటీసీ ఇంట్లో దొంగతనం

- 12 తులాల బంగారం, 25 తులాల వెండి, రూ.7 వేల నగదు అపహరణ
- పక్కనే ఉన్న ఇంట్లో కూడా 2 తులాల బంగారం చోరీ


ఎంపీటీసీ ఇంట్లో దొంగలు కిందపడేసిన బీరువా

కొమరోలు: మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు చెన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో శనివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. అమరావతి–కడప రాష్ట్రీయ రహదారి పక్కనే ఉన్న ఇంట్లో వెనుక వైపున్న ఓ రూంలో కుటుంబంతో కలిసి ఎంపీటీసీ నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచి చూడగా, ఇంటి తలుపులు పగులగొట్టి బీరువా కిందపడేసి ఉన్నాయి. దొంగలు పడి బీరువాలోని 12 తులాల బంగారు నగలు, 25 తులాల వెండి వస్తువులు, రూ.7 వేల నగదు అపహరించారని గుర్తించి వెంటనే స్థానిక ఎస్సై మధుసూదన్ రావుకు సమాచారం అందించారు. సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఎస్సై పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అలాగే, పక్కనే ఉన్న బొడ్డు సుబ్బయ్య ఇంట్లో కూడా దొంగలు పడి 2 తులాల బంగారం చోరీ చేశారు. మార్కాపురం నుంచి వచ్చిన క్లూస్ టీమ్ రెండు ఇళ్లలో వేలిముద్రలు సేకరించింది.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా సైదా



పొదిలి: కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా పొదిలికి చెందిన షేక్.సైదాను నియమించారు. ఈమేరకు పార్టీ ఏపీ ఇన్‌చార్జ్ వేణుగోపాల్ నుంచి ఉత్తర్వులు అందాయని సైదా తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందులకు న్యాయం చేస్తానని సైదా చెప్పారు.

వినాయక నిమజ్జనాలను జాగ్రత్తగా నిర్వహించాలి

- కొత్తపట్నం బీచ్‌ను సందర్శించిన ఎస్పీ దామోదర్


కొత్తపట్నం బీచ్‌లో వినాయక నిమజ్జనాల గురించి మెరైన్ పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

కొత్తపట్నం: కొత్తపట్నం బీచ్‌లో వినాయక నిమజ్జనాలను జాగ్రత్తగా నిర్వహించాలని ఎస్పీ దామోదర్ పోలీసు అధికారులు, విగ్రహ కమిటీలను ఆదేశించారు. వినాయకచవితి ఉత్సవాల అనంతరం విగ్రహాల నిమజ్జనాలు జరగనున్న నేపథ్యంలో జిల్లాలోనే అధిక సంఖ్యలో విగ్రహాల నిమజ్జనాలు జరిగే కొత్తపట్నం సముద్రతీర ప్రాంతాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అక్కడ చేపడుతున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీరంలోని పలు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యేక ఏర్పాట్లపై పోలీస్ యంత్రాగానికి పలు సలహాలు, సూచనలు చేశారు. విగ్రహాల నిమజ్జనాలలో ఎలాంటి అపశ్రుతులు, అవాంతరాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సముద్రంలో లోతుకు వెళ్లకుండా కర్రలకు జెండాలు కట్టి అమర్చాలన్నారు. అవసరమైతే వలలు కూడా ఏర్పాటు చేస్తే ప్రాణ నష్టం ఉండదన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాలని సూచించారు. గజఈతగాళ్లు, ఫ్లడ్‌లైట్లు, లైఫ్ జాకెట్లు, నాటు పడవలు మొదలైనవి సిద్ధం చేసుకోవాలని సూచించారు. మైక్‌లు ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేస్తూ ఉండాలన్నారు. అనంతరం గజఈతగాళ్లకు టీషర్టులను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జన ప్రక్రియకు పోలీసుశాఖపరంగా జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాలువలు, చెరువులు, నదుల వద్ద నిమజ్జనం చేసే ప్రాంతాలను ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులు ముందుగానే గుర్తించి అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, స్థానిక ఎస్సై సుధాకర్, మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు, సివిల్, మెరైన్ పోలీసులు పాల్గొన్నారు.

డీజేలు వద్దని గ్రామస్తుల వినతి...

వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనాల సమయంలో డీజే మ్యూజిక్ సిస్టంలు విచ్చలవిడిగా వాడటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, వాటిని నిషేధించాలని కొత్తపట్నం ప్రజలు ఎస్పీ దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు. దోనె వెంకటేశ్వర్లు, మరికొంత మంది గ్రామస్తులు కొత్తపట్నం బీచ్‌లో ఎస్పీని కలిశారు. ఒక మనిషి 60 డెసిబెల్స్ ధ్వని మాత్రమే వినగలడని, కానీ, డీజేల ద్వారా 250 నుంచి 300 డెసిబెల్స్ ధ్వని వస్తోందని, వీటి వల్ల వినికిడి లోపం తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. కొత్తపట్నంలో భారీగా విగ్రహాలను నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో డీజేలను అదుపు చేయాలని కోరారు.

మార్కాపురం జీజీహెచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


జీజీహెచ్‌లో ఉన్న మృతదేహం

మార్కాపురం: స్థానిక జీజీహెచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని, గుర్తించిన వారు వివరాలు తెలియజేయాలని పట్టణ ఎస్సై సైదుబాబు కోరారు. ఆదివారం ఆ వివరాలు వెల్లడించారు. సుమారు 45–50 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి మార్కాపురం పట్టణంలోని కొండేపల్లిరోడ్డు ఏరియాలో తిరుగుతూ మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై కిందపడిపోయాడు. స్థానికులు గుర్తించి 108లో మార్కాపురం జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మృతదేహం మార్చురీలో ఉంది. వివరాలు తెలిసిన వారు తనను సంప్రదించాలని పట్టణ ఎస్సై కోరారు.

ఏసీఏ నూతన కమిటీకి పీడీసీఏ అభినందనలు



ఏసీఏ నూతన కమిటీకి అభినందనలు తెలుపుతున్న పీడీసీఏ ప్రతినిధులు

ఒంగోలు: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నూతన కమిటీకి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ (పీడీసీఏ) ప్రతినిధులు ఆదివారం అభినందనలు తెలిపారు. విజయవాడలోని లెమన్ ట్రీ ప్రీమియర్ ఇంటర్నేషనల్ హోటల్ సమావేశ మందిరంలో ఏసీఏ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ప్రధాన కార్యదర్శి సానా సతీష్, కోశాధికారి ఎం.శ్రీనివాస్ తదితరులను ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు కలుసుకుని అభినందనలు తెలిపారు. ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్, ప్రధాన కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు, సభ్యులు కొల్లా మధు, యంగళశెట్టి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


మృతిచెందిన వెంకట సుదర్శన్‌కుమార్

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని హైవేపై యడవల్లి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గిద్దలూరు పట్టణానికి చెందిన అద్దంకి వెంకట సుదర్శన్‌కుమార్ (28) కొమరోలు మండలం తాటిచర్లమోటు గ్రామంలో పుట్టినరోజు వేడుకల కోసం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తాటిచర్లమోటు నుంచి గిద్దలూరుకు మోటారు సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని 108లో గిద్దలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుదర్శన్‌కుమార్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మద్యం మత్తులో చెరువులో పడి బేల్దారీ మృతి

ఒంగోలు టౌన్: భవన నిర్మాణ కార్మికుడు మద్యం మత్తులో చెరువులో పడి మృతిచెందాడు. మద్రిపూడి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన యాచేపల్లి సురేష్ (35) కొద్దిరోజులుగా సంతనూతలపాడు మండలం తక్కెళ్లపాడులో నివాసం ఉంటున్నాడు. ప్రతిరోజూ తక్కెళ్లపాడు నుంచి ఒంగోలు వచ్చి బేల్దారీ పనులు చేసుకుని వెళ్తుంటాడు. ఎప్పటిలాగే ఈ నెల 6వ తేదీ ఒంగోలు వచ్చిన సురేష్ తిరిగి ఊరికి వెళ్లలేదు. ఊరికి వెళ్లడానికి కూడా జేబులో డబ్బు లేవని 7వ తేదీ బావమరిదికి ఫోన్ చేశాడు. ఆయన ఫోన్ పే ద్వారా డబ్బు పంపించాడు. అయితే, మద్యానికి అలవాటు పడిన సురేష్.. మద్యం తాగి ఆ మత్తులో రంగరాయుడు చెరువులో పడినట్లు భావిస్తున్నారు.

ఆదివారం ఉదయం అయ్యప్పస్వామి గుడి ఎదురుగా రంగరాయుడు చెరువులో మృతదేహం నీటిలో తేలియాడుతుండటంతో పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు సురేష్‌కు భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

ప్యాంటు దొంగిలించబోయిన వ్యక్తికి కౌన్సిలింగ్

ఒంగోలు టౌన్: ప్యాంటు దొంగిలించబోయిన వ్యక్తిని షాపు నిర్వాహకులు పట్టుకుని పోలీసులకు అప్పగించగా, వారు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఒంగోలు నగరంలోని మంగమూరు రోడ్డుకు చెందిన బ్రహ్మయ్య శనివారం స్థానిక ఓ రెడీమేడ్ దుకాణానికి దుస్తులు కొనడానికి వెళ్లాడు. కొత్త ప్యాంటు ఎంపిక చేసుకుని ట్రయల్ రూంకు వెళ్లాడు. కొత్త ప్యాంటు వేసుకుని పాత ప్యాంట్ అక్కడే వదిలిపెట్టి బయటకు వచ్చాడు. బిల్లు చెల్లించకుండానే బయటకు వెళ్లిపోతుండటాన్ని గమనించిన షాపులోని గుమస్తాలు బ్రహ్మయ్యను పట్టుకుని నిలదీశారు. తాగిన మైకంలో ఉన్న అతడు.. వారితో వాదనకు దిగాడు. చేసేది లేక దుకాణ యజమాని స్థానిక వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. ప్రస్తుతం పోలీసులు బ్రహ్మయ్యకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

మైదాన ప్రాంత కమ్మర కులస్తులకు ధ్రువీకరణ పత్రాలివ్వాలి

- రాష్ట్ర కమ్మర (ఎస్టీ) జేఏసీ చైర్మన్ కంద్రాతి

ఒంగోలు సెంట్రల్: మైదాన ప్రాంత కమ్మర కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటే పేద కమ్మరలకు ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర కమ్మర (ఎస్టీ) జేఏసీ చైర్మన్ కంద్రాతి వెంకట సుబ్బారావు అన్నారు. ఒంగోలులోని గిరిజనభవన్‌లో ఆదివారం రాష్ట్ర కమ్మర తెగ (ఎస్టీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ 1977లో జీఓ నంబర్ 147 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతా కమ్మర కులస్తులకు తహసీల్దార్ల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు అందించేదని చెప్పారు. 1997లో జీవో నంబర్ 58 ప్రకారం ఏజెన్సీలో కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు, మైదాన ప్రాంత కమ్మరలకు డీఆర్‌ఓ జారీ చేసేవారని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాల కోసం డీఆర్‌ఓ స్థాయి వరకు వెళ్లలేక అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని వివరించారు. ధ్రువీకరణ పత్రాల మంజూరులో తీవ్ర జాప్యం వలన పలు అవకాశాలను కోల్పోతున్న యువత గురించి తెలిపారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతిపత్రాలు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకులు పేరం సత్యం, రాష్ట్ర కమ్మర సంఘ నాయకులు, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ పీవీ లక్ష్మీనారాయణ, దూక్కేరు ప్రభాకరరావు, కంద్రాతి ప్రసాద్, బాళ్ల శ్రీనివాసులు, సుధాకర్, చెంచాల రావు పాల్గొన్నారు.